RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ గురువారం 21.05.2026 సంపుటి : 03 సంచిక : 162 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Thursday 21.05.2026 Volume: 03 Issue 162 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక






## రేసులోనే కోల్‌కతా 4 వికెట్లతో ముంబై చిత్తు

**కోల్‌కతా:** కీలక మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్).. ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. మనీష్ పాండే (45), రోవ్‌మన్ పావెల్ (40)తో పాటు బౌలర్లు రాణించడంతో.. బుధవారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 4 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌పై నెగ్గింది. పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి ఎగబాకింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 147/8 స్కోరు చేసింది. కార్బిన్ బాష్ (32 నాటౌట్), హార్దిక్ పాండ్యా (26) టాప్ స్కోరర్లు. గ్రీన్, సౌరభ్ దూబే, కార్తీక్ తలో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. ఛేదనలో కోల్‌కతా 18.5 ఓవర్లలో 148/6 స్కోరు చేసి గెలిచింది. రహానె (21) ఫర్వాలేదనిపించాడు. బాష్ 3 వికెట్లు పడగొట్టాడు. గత కొద్ది మ్యాచ్



లకు దూరమైన హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ మళ్లీ ముంబై జట్టులోకి వచ్చారు. మనీష్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

## రూ.5 వేల కోట్ల ప్రత్యేక సాయం చేయండి

### కేంద్ర మంత్రులు నిర్మల, కిషన్‌రెడ్డిలకు భట్టి విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, మే 20 :** తెలంగాణకు ఆర్థిక ఊతం అందించాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. అలాగే, 'బొగ్గు గ్యాసిఫికేషన్' ప్రాజెక్టుకు సింగరేణి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలిపారు. ఢిల్లీలో బుధవారం నిర్మలా సీతారామన్, కిషన్ రెడ్డిని ఆయన వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. తొలుత నిర్మలా సీతారామన్‌ను కలిసిన భట్టి.. పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21,000 కోట్లు, డిగ్రీ, జూనియర్, సాంకేతిక కళాశాలల్లో మౌలిక వసతుల కోసం రూ.9,000 కోట్లను వెచ్చిస్తున్నామని వివరించారు. ఈ



విజ్ఞప్తులపై స్పందించిన కిషన్‌రెడ్డి.. సమస్యల పరిష్కారానికి త్వరలోనే కేంద్ర, రాష్ట్ర, సింగరేణి అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.


## నేటి నుంచి సరస్వతీ అంత్య పుష్కరాలు

### పుష్కరాలకు ఘనంగా ఏర్పాట్లు

### భక్తులకు సీఎం శుభాకాంక్షలు



**హైదరాబాద్, మే 20 :** సరస్వతీ అంత్య పుష్కరాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. నేటి నుంచి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తులు ఆరోగ్యం కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుష్కరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ పుష్కర శుభాకాంక్షలు తెలిపారు.మే 21వ తేదీ ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభంకానున్నాయి. తొలి పుష్కర స్నానం కంచి స్వామి విజయేంద్ర సరస్వతీ చేయనుండగా, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం కానుంది.12 రోజుల పాటు కొనసాగే ఈ పుష్కరాలకు సుమారు 30 నుంచి 40 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.30.63 కోట్లతో భారీ ఏర్పాట్లు చేపట్టింది.



కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం కొట్టివేసింది.

## కుల గణనకు ఓకే

### సీజేఐ ధర్మాసనం కీలక తీర్పు



- వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం కొట్టివేత
- సంక్షేమ పథకాల అమలుకు కులగణన తప్పనిసరి
- కుల గణన ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం
- ఈ అంశంలో కోర్టుల జోక్యం ఉండదు
- వెనుకబడిన తరగతికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సి ఉంది

న్యూఢిల్లీ, మే 20: కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం కొట్టివేసింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించారు.సంక్షేమ పథకాల అమలుకు కులగణన తప్పనిసరి అని స్పష్టం చేసింది. కుల గణన ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. ఈ అంశంలో కోర్టుల జోక్యం ఉండదని స్పష్టం చేసింది. జన గణన.. కుల ప్రాతిపదికన జరగాలా వద్దా అనేది విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. వెనుకబడిన తరగతికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సి ఉందని ఈ ధర్మాసనం వ్యాఖ్యానించింది.జనగణన నుంచి కులగణనను మినహాయించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం తిరస్కరించింది. ఈ అంశం ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని వివరించింది. అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని తెలిపింది. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జయమల్యా బాగ్చీ, విపుల్ పంచోలీతో కూడిన ధర్మాసనం విచారించింది.

## నేడు క్యాబినెట్ సహా స్వతంత్ర మంత్రులు, సహాయమంత్రులతో ప్రధాని భేటీ



**న్యూఢిల్లీ, మే 20 :** ప్రధాని మోదీ అధ్యక్షతన నేడు గురువారం కేంద్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. పైకి సాధారణ సమావేశం లాగే కనిపిస్తున్నా మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీ కరించనున్నారంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో ఈ భేటీకి అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కొందరిని మంత్రి వర్గం నుంచి తప్పిస్తారంటూ వార్తలు గుప్పుమంటున్న నేపథ్యంలో పాతికమందికి పైగా మంత్రులకు ఇదే చివరి మంత్రివర్గ సమావేశం కానుందనే మాట కూడా వినిపి స్తోంది. మోదీ ప్రభుత్వంలోని 30మంది క్యాబినెట్ మం త్రులు, 36మంది సహాయ మంత్రులు, స్వతంత్ర హోదా కలిగిన ఐదుగురు మంత్రులు.. ఇలా మొత్తంగా 72 మంది మంత్రులు మోదీ అధ్యక్షతన ఈ సమావేశంలో పాల్గొనను న్నారు. మోదీ ప్రభుత్వంలోని మంత్రులంతా సమావేశం కానుండటం ఈ ఏడాది ఇదే తొలిసారి. మంత్రుల పనితీరు, ప్రవర్తన వంటివి ప్రాతిపదికగా తీసుకొని పెద్ద సంఖ్యలో మంత్రులను సాగనంపేందుకు ఏర్పాట్లు జరగుతున్నాయని సమాచారం. వివాదాలతో వార్తల్లో నిలిచిన మంత్రులకు ఊస్టింగ్ తప్పదని తెలుస్తోంది.

## కోనేరులో మునిగి ముగ్గురు చిన్నారుల మృతి

### జగిత్యాల జిల్లా కొండాపూర్‌లో ఘటన

### రెండు కుటుంబాల్లో తీరని శోకం



**కోరుట్ల, మే 20:** మొక్కులు చెల్లించుకునేందుకు దైవదర్శనానికి వెళ్లిన ఆ కుటుంబాన్ని విధి వెక్కిరించింది. అభం శుభం తెలియని ముగ్గురు చిన్నారులను కోనేరు బలిగొన్నది. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్‌లో జరిగిన విషాద ఘటన రెండు కుటుంబాల్లో తీరని వేదన మిగిల్చింది. కొండాపూర్‌కు చెందిన వడ్లగట్ట శేఖర్, భార్గవి దంపతులకు కొడుకు శర్వాంద్ శివ (7) ఉన్నాడు. శేఖర్ కోరుట్ల పట్టణంలోని ఓ డిష్ కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తుండగా, భార్గవి పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కాలేజీలో లెక్చరర్. భార్గవి ఇటీవల గర్భం దాల్చడంతో కొండాపూర్ శివారులో గంగమ్మ తల్లి(శివగంగ)కి తెప్ప మొక్కులు తీర్చుకునేందుకు కుటుంబసభ్యులతో కలిసి బుధవారం వెళ్లారు. తమతో పాటు జగిత్యాలలో నివాసం ఉంటున్న తన అక్క, బావ భారతి-నాగభూషణం దంపతులనూ శుభకార్యానికి పిలిచింది. వారు తమ పిల్లలు మన్విత్‌సాయి (13), మనస్విని (11)తో కలిసి శివ గంగకు వచ్చారు. వంటలు చేసుకొని భోజనాలు చేసిన తర్వాత అందరూ కలిసి సంతోషంగా గడిపారు.చిన్నారులు ఆడుకుంటామని చెప్పి దగ్గరలో ఉన్న కోనేరు వద్దకు వెళ్లి అందులో పడి మునిగిపోయారు. కుటుంబసభ్యులు పిల్లల కోసం వెతగ్గా కోనేరులో విగతజీవులుగా కనిపించా రు. వెంటనే బయటకు తీసిన కుటుం బసభ్యులు సీపీఆర్ చేసినా చిన్నారుల ప్రాణాలు దక్కలేదు. పది నిమిషాల వ్యవధిలో అంతా జరిగిపోయిందని కుటుంబ సభ్యులు రోదించారు. శర్వాం ద్‌శివ కోరుట్ల పబ్లిక్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. అన్నాచెల్లెలు మన్విత్ సాయి, మనస్విని జగిత్యా లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 7, 6 తరగతులు చదువుతున్నారు. వీరి తల్లిదండ్రులు నాగభూషణం- భారతీ దంపతులు జగిత్యాలలో ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్నారు.ఘటనాస్థలాన్ని కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ పరిశీలిం చారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

## సుదూర శత్రువుపై 'సూర్యాస్త్రం'

### 300 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించిన సూర్యాస్త్ర

### సూర్యాస్త్ర రాకెట్ లాంచర్ వ్యవస్థ పరీక్ష విజయవంతం

**బాలాసోర్, మే 20:** భారత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా, స్వదేశీ రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి సరికొత్త ఊతమిచ్చేలా మరో కీలక ముందడుగు పడింది. పుణెకు చెందిన ప్రైవేటు రక్షణ సంస్థ 'నిబె లిమిటెడ్' స్వదేశీయంగా అభివృద్ధి చేసిన 'సూర్యాస్త్ర యూనివర్సల్ రాకెట్ లాంచర్' వ్యవస్థను విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని చాందీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్)లో ఈ నెల 18, 19వ తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించినట్టు ఆ సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా సుదీర్ఘ దూరంలోని లక్ష్యాలను 'సూర్యాస్త్ర' అత్యంత కచ్చితత్వంతో ఛేదించినట్టు తెలిపింది. ఈ ఏడాది జనవరిలో భారత సైన్యం అత్యవసర సేకరణ కింద నిబె లిమిటెడ్‌కు కీలకమైన కొనుగోలు ఆర్డర్ ఇచ్చింది. ఈ ఒప్పందంలో భాగంగా సూర్యాస్త్ర యూనివర్సల్ రాకెట్ లాంచర్‌తోపాటు 150 కి.మీ., 300 కి.మీ. పరిధిగల రాకెట్ల అభివృద్ధి, సరఫరాను నిబె సంస్థ వేగవంతం చేసింది. ఈ క్రమంలో సోమ, మంగళ వారాల్లో నిర్వహించిన టెస్టుల్లో సూరాస్త్ర రాకెట్ వ్యవస్థలో రెండు వేరియంట్లను పరీక్షించగా అవి అత్యంత కచ్చితత్వాన్ని ప్రదర్శించాయని ఆ సంస్థ తెలిపింది. 150 కి.మీ పరిధిగల రాకెట్ 1.5 మీటర్ల సీఈపీ (సర్క్యులర్ ఎర్రర్ ప్రాబబుల్)ని, 300 కి.మీ. పరిధి గల రాకెట్ 2.0 మీటర్ల సీఈపీని నమోదు చేసినట్టు పేర్కొంది. రక్షణ రంగంలో ఉపయోగించే మందుగుండు లేదా రాకెట్ సామర్థ్యంలో 50 శాతం పడిపోయే వ్యాసార్థాన్ని కొలిచే కొలమానాన్ని సీఈపీ



అంటారు. ఈ వ్యాసార్థం ఎంత తక్కువగా ఉంటే.. ఆయుధం అంత కచ్చితంగా లక్ష్యాన్ని తాకినట్టు లెక్క. 300 కి.మీ. ప్రయాణించినా రెండు మీటర్ల కంటే తక్కువ వ్యాసార్థంలో లక్ష్యాన్ని దెబ్బతీయడం ద్వారా ప్రపంచంలోని అత్యంత కచ్చితమైన సుదూర రాకెట్ వ్యవస్థల్లో సూర్యాస్త్ర ఒకటిగా నిలిచింది. దీంతో భారత సైన్యం శత్రువుల స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని, దాని చుట్టుపక్కల అదనపు ఆస్తి, ప్రాణనష్టం లేకుండా లక్షిత ప్రాంతాన్ని మాత్రమే ధ్వంసం చేయడానికి అవకాశం ఉంటుంది.

# దివ్యాంగులకు త్రి చక్ర వాహనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జనోదయ : గోదావరిఖని

రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మోటరైజ్ట్ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని 20 మంది లబ్ధిదారులకు వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఉచిత వాహనాల పంపిణీ ద్వారా దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడి, వారి స్వావలంబనకు ఇది ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కూడా సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. దివ్యాంగుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించే దిశగా నిరంతరం కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. వాహనాలు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# పేదోళ్లకు కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి కొండా సురేఖ

## వరంగల్ ప్రభుత్వ "కంటి" ఆసుపత్రికి మహర్దశ





జనోదయ : వరంగల్ ఎంజీఎం

సామాన్యులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.వరంగల్ ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా రూ. 75 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను మంత్రి వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి ప్రారంభించారు.అనంతరం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ..వరంగల్ రీజనల్ ఐ హాస్పిటల్‌ను అత్యాధునిక వైద్య సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.రోగులకు మెరుగైన సేవలందించడమే కాకుండా, ఆసుపత్రిని అన్ని విధాలా బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నామన్నారు.సిబ్బంది కొరత లేకుండా, అవసరమైన వైద్య పరికరాలను వెంటనే అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తాం అని మంత్రి పేర్కొన్నారు.రోగులను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదు..ఏజెన్సీ ద్వారా రిక్రూట్ మెంట్ అయిన వర్కర్స్ విధినిర్వహణలో రోగులను ఇబ్బందులకు గురి చేస్తే ఉపేక్షించేది లేదని, విధులకు భంగం కలిగించకుండా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించుటకు వైద్య అధికారులు ముందుండాలని మంత్రి పేర్కొన్నారు.సిపిఎం ఆస్పత్రిలో..సికెం ఆస్పత్రి అభివృద్ధిలో భాగంగా మంత్రి మాట్లాడుతూ.. నవ మాసాలు మోసిన తల్లికి బిడ్డ దక్కకపోతే ఆ తల్లి భాద వర్ణనాతీతమని, ప్రసవించిన ప్రతి మహిళను పుట్టింటి నుండి సాగనంపినట్లుగా 108 వాహనం ద్వారా ఆసుపత్రి నుండి వారి ఇంటికి చేర్చాలని మంత్రి సూపరిండెంట్ ను ఆదేశించారు.పేషంట్ బిడ్డతో డిశ్చార్జ్ అయినప్పుడు వారి వీడియోలు సోషల్ మీడియా ద్వారా వైరల్ చేసి పేషెంట్ మాటలను ప్రజలకు తెలిసే విధంగా పబ్లిసిటీ ఇవ్వాల్సిందిగా మంత్రి పేర్కొన్నారు. నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాలని, అందుకు యోగా మాస్టర్ ద్వారా నార్మల్ డెలివరీ అయ్యేందుకు ఉపయోగపడే యోగాసనాలను చేయించేలా చూడాలన్నారు.వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. సి కె ఎం ఆసుపత్రికి ఐదు బెడ్స్ ను డొనేట్ చేస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం లక్ష రూపాయల వ్యయంతో ఐదు బెడ్లను అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్న 75 పడకల సామర్థ్యాన్ని 100 పడకలకు పెంచుతూ ప్రభుత్వానికి నివేదికలు పంపించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆధునిక వైద్య పరికరాలను ఆరోగ్యశ్రీ రివాల్వింగ్ ఫండ్ ద్వారా రూ. 1.73 కోట్లతో కొనుగోలు చేసేందుకు కమిటి ద్వారా ఆమోదం తీసుకున్నారు. కార్యక్రమాలలో అడ్మిన్ కమిటి మెంబెర్స్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, డిబిసిడిఓ పుష్పలత, డి ఎస్ డి ఓ భాగ్యలక్ష్మి, ఇరిగేషన్ ఈ. సునీత, ఎంజీఎం సూపర్డెంట్ హరిచంద్ర రెడ్డి, డాక్టర్ లు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# మేర సంఘం చైర్మన్‌కు బీసీ ఫోరం ఘన సన్మానం

## కాశీబుగ్గలో సమావేశం

## బీసీలకు జనాభా ప్రాతిపదికన పదవులు

## ఇవ్వాలని డిమాండ్



జనోదయ : వరంగల్ ప్రతినిధి

బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మేర సంఘం రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సంగ రాజలింగంను ఘనంగా సన్మానించారు. డాక్టర్ కొంతం కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. వీరస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీల జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని రంగాల్లో, అన్ని కార్పొరేషన్లలో పదవులు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించి ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ అభివృద్ధికి కృషి చేయాలని, లేకపోతే వాటికి అర్థం ఉండదని స్పష్టం చేశారు. సంగ రాజలింగం సేవలను గుర్తించి మేర సంఘం కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.బీసీ నేత ఐతం నగేష్ మాట్లాడుతూ.. బీసీలు ఐక్యమైతేనే పదవులు వచ్చి ప్రజలకు మేలు చేయవచ్చన్నారు. ధర్మపురి రామారావు మాట్లాడుతూ.. బీసీల ఐకమత్యం ద్వారానే రాజ్యాధికారం సాధించగలమని పేర్కొన్నారు. బీసీఐఎఫ్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కొంతం కృష్ణ సమావేశానికి హాజరైన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ వందన సమర్పణ చేశారు.

# ఆలయ చైర్మన్ శకుంతల సుధాకర్‌కు పద్మశాలి ట్రస్ట్ సన్మానం



## ఎల్బీనగర్‌లో కార్యక్రమం

## ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని వినతి

జనోదయ : వరంగల్ ప్రతినిధి

పురాతన శ్రీ రంగనాథస్వామి దేవాలయం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోషికొండ శకుంతల సుధాకర్‌ను పద్మశాలి సేవా సంఘం ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు గోరంటల రాజు, ప్రచార కార్యదర్శి ఆకెన వెంకటేశ్వర్లు, సభ్యులు బైరి మురళీకృష్ణ, గాదె ప్రభాకర్, బింగి మహేష్, కోమాకుల నాగరాజు పాల్గొని అభినందించారు. శ్రీ రంగనాథస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని, భక్తుల మనోభావాలకు అనుగుణంగా దేవాలయాన్ని తీర్చిదిద్దాలని ట్రస్ట్ సభ్యులు కోరారు. అలాగే శకుంతల సుధాకర్ మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.పద్మశాలి సేవా సంఘం ట్రస్ట్ సంస్కృతిక కార్యదర్శి ఆకెన వెంకటేశ్వర్లు ఈ వివరాలు తెలిపారు.

# రామగుండం సమగ్ర అభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే



జనోదయ : గోదావరిఖని

రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ సింగరేణి, మున్సిపల్, పంచాయతీ రాజ్ మరియు ఇతర ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల త్వరిత పరిష్కారం మరియు మౌలిక వసతుల మెరుగుదల లక్ష్యంగా నిర్వహించిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, తాగునీటి సరఫరా వ్యవస్థ, రోడ్ల నిర్మాణం మరియు మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ సమస్యలు, విద్యుత్ సౌకర్యాలు మరియు ప్రజలకు అవసరమైన ఇతర ప్రాథమిక వసతులపై అధికారులతో ఎమ్మెల్యే విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత, సమయపాలన తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి, సౌకర్యాలు మరియు పరిపాలనలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు.

# రూ.6 కోట్లతో యూజీడీ పనులకు ఎమ్మెల్యే నాగరాజు శంకుస్థాపన

### బాబు జగ్జీవన్ రామ్ బొమ్మ నుండి లేబర్ కాలనీ వరకు అండర్ గ్రౌండ్ పైప్‌లైన్

### శ్రీనివాస కాలనీలో రూ.50 లక్షల సీసీ రోడ్ పనులు

జనోదయ : వరంగల్ ప్రతినిధి

ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం 14వ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. బాలాజీ నగర్ జంక్షన్ వద్ద బాబు జగ్జీవన్ రామ్ బొమ్మ నుండి లేబర్ కాలనీ 100 ఫీట్ల రోడ్డు వరకు రూ.6 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీనివాస కాలనీలో రూ.50 లక్షలతో సీసీ రోడ్, డ్రైనేజీల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. యూజీడీ పనులు పూర్తయితే స్థానికులకు మురుగునీటి సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుందని, వర్షాకాల ఇబ్బందులు తీరుతాయని తెలిపారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు రాజీ పడకుండా సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, వీధి దీపాల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.



# జూనియర్ ఎన్టీఆర్ బర్త్‌డే



### వరంగల్‌లో ఎన్టీఆర్ యువసేన సేవా కార్యక్రమాలు

### మదర్ తెరిసా ఆశ్రమంలో అన్నదానం, ఎంజీఎంలో రక్తదాన శిబిరం

జనోదయ : వరంగల్ ప్రతినిధి

జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ఆల్ ఇన్ వన్ ది వరంగల్ డిస్ట్రిక్ట్ ఎన్టీఆర్ యువసేన ఆధ్వర్యంలో బుధవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేట్ కన్వీనర్ పంజా రాంబాబు ఆధ్వర్యంలో కాశీబుగ్గలోని మదర్ తెరిసా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం, కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం ఎంజీఎం హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాతలకు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్ర రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎన్టీఆర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల శివకుమార్‌తో పాటు పెద్ద ఎత్తున ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# చెన్నూర్ ఎస్బిఐ బ్రాంచ్ 2లో నిలిచిపోయిన సేవలు

జనోదయ : ఆర్ సి చెన్నూర్

గోల్డ్ లోన్ బాధితులు తమ గోల్డ్ తమకు ఇవ్వాలంటూ... ఆందోళనకుదిగారు.గత తొమ్మిది నెలల నుంచి ఇప్పటివరకు తమ గోల్డ్ ఇవ్వకుండా సమాధానాలు చెప్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.గోల్డ్ లోన్ బాధితులకు బ్యాంకు అధికారులు వివిధ రకాల నోటీసులు పంపియడం పట్ల బాధితులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు.ఈరోజుగోల్డ్ బాధితులు అందరూ కలిసి ఎస్బిఐ రెండవ బ్రాంచ్ లో మూకుమ్మడిగా ముట్టడి చేసి సేవలను నిలిపివేశారు.ఈరోజు ఉన్నత అధికారులు వచ్చి స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమం మొదలుపెడతామని హెచ్చరించారు.



# నేటి నుండి సరస్వతీ అంత్య పుష్కరాలు

### మే 21 నుండి జూన్ 1 వరకు నిర్వహణ

### రూ.1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు

### 100 మంది గజ ఈతగాళ్ల నియామకం

జనోదయ : హైదరాబాద్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాదాపూర్ మండలంలోని కాలేశ్వర స్వామి క్షేత్రం వద్ద గల త్రివేణి సంగమములో గురువారం నుండి ప్రారంభమయ్యే సరస్వతి అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. పుష్కర స్నానాలు మే 21 వ తేదీ నుండి 12 రోజుల పాటు (జూన్ 1 వరకు) జరగనున్నాయి. ఈ పుష్కరాలకు 30 నుండి 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది.గత సంవత్సరం జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల సందర్భంగా జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంత్య పుష్కరాలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలను చేపట్టింది. ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పుష్కర ఘాట్ వద్ద కాయర్ మ్యాట్లు, చలువ పందిళ్లు, ఓ. ఆర్.ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ పరిసరాల్లోని 23 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్, బీ.టి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పుష్కరాల పనుల కోసం ప్రభుత్వం రూ. 30.63 కోట్ల నిధులను కేటాయించింది.కంచి స్వామి విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా లచే తొలి పుష్కర స్నానం.. పుష్కరాల తొలిరోజైన 21 వ తేదీ తెల్లవారు ఝామున 5. 43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాలు పుష్కర స్నానం చేసి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. 21 వ తేదీ నుండి జూన్ 1 వతేదీ వరకు ప్రతీ రోజూ ఒక





ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కారాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారు. ప్రతీరోజూ ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 90 షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. రెస్క్యూ బృందాలతోపాటు ప్రత్యేక శిక్షణ పొందిన 100 మంది గజ ఈతగాళ్లను సరస్వతీ ఘాట్, నదీ ప్రాంతంలో నియమించారు. రూ. 1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు.దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20కోట్లలతో ప్రత్యేకంగా మ్యూజియాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నాగేంద్ర స్వామి ఆలయాన్ని 30 లక్షలతో పునర్నిర్మాణం చేశారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ నిర్వహించే హారతి, హోమాలు, తెప్పోత్సవం లకు పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టారు. పుష్కరాలకు హాజరయ్యే వారి సౌకర్యార్థం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించారు. దాదాపు 500 టాయిలెట్లు ప్రత్యేకగా ఏర్పాటు చేయడంతోపాటు తాగునీటి కోసం రెండు ఓ.హెచ్.ఆర్.సి లను నిర్మించారు. వాహనాల కోసం ఏర్పాటు చేసిన 23 పార్కింగ్ కేంద్రాలలోనూ తాగునీటి సౌకర్యంతో పాటు టాయిలెట్లను కూడా ఏర్పాటు చేశారు.300 మంది వైద్యాధికారులతో మెడికల్ క్యాంపుల ఏర్పాటు..కాళేశ్వరం పుష్కర ఘాట్ లోని 23 జోన్లలో ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఇందుకుగాను 300 మంది వైద్యాధికారులు, పారా మెడికల సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. అన్ని ప్రధాన ప్రాంతాల్లో అంబులెన్సులు నియమించారు. మహాదేవ పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెఫరల్ ఆసుపత్రిగా ఏర్పాటు చేశారు.245 ఎకరాల్లో 1.70 లక్షల వాహనాల పార్కింగ్ కై ప్రత్యేక ఏర్పాట్లు..ఈసారి సరస్వతీ అంత్య పుష్కారాలకు లక్షా 70 వేల వాహనాలు వస్తాయని అంచనా వేసి వీటికి గాను 245 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ ఏరియాలతో పాటు ఘాట్స్, టెంపుల్ తదితర ప్రాంతాలలో 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వెళ్లే మార్గంలో ప్రత్యేకంగా ఎల్.ఈ.డీ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ 12 రోజులపాటు పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకుగాను 300 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించారు. పుష్కర ఘాట్లలో నిరంతరం విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టారు. 100 మంది గజ ఈతగాళ్ల నియామకం..పుష్కర స్నానాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సుమారు 100 మంది గజ ఈతగాళ్లను నియమించారు. వీటితోపాటు సెఫ్టీ బోట్స్, లైఫ్ రింగ్స్, ఎస్.డి.ఆర్.ఎఫ్ టీంలను నియమించారు. పుష్కర కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందించేందుకు మీడియా సెంటర్ ను కూడా ఏర్పాటు చేశారు.

# కొత్త పార్టీ అనేది తప్పుడు ప్రచారం

చనిపోయిన తర్వాత కూడా బీజేపీ జెండా కప్పాలని కోరుకునే కార్యకర్తలు తమ పార్టీలో ఉన్నారని పేర్కొన్నారు. తాను కూడా కమిట్‌మెంట్ ఉన్న కార్యకర్తనన్నారు. తన కన్న కొడుకుని కూడా విచారణకు సహకరించాలని స్వయంగా పోలీసులకు అప్పగించానని ప్రస్తావించారు. చట్టం ముందు అందరూ సమానమనే భావనతోనే వ్యవహరించానని తెలిపారు. కొత్త పార్టీ వస్తుందనేది తప్పుడు ప్రచారమని స్పష్టం చేశారు.

## నేను కమిట్‌మెంట్ ఉన్న కార్యకర్తను

- బీజేపీ కార్యకర్తలు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తారు
- కన్న కొడుకుని కూడా విచారణకు సహకరించాలని స్వయంగా పోలీసులకు అప్పగించా
- చట్టం ముందు అందరూ సమానమనే భావనతోనే వ్యవహరించా
- కేసీఆర్ కుటుంబ పాలనను అంతం చేశా
- గడీల రాజకీయాలను బద్దలు కొట్టాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్

బీజేపీ కార్యకర్తల కమిట్‌మెంట్, క్రమశిక్షణపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ కార్యకర్తలు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తారని స్పష్టం చేశారు. బీజేపీలో పనిచేసే ప్రతి కార్యకర్త శిక్షణ తీసుకుని పనిచేస్తారని తెలిపారు.



**హైదరాబాద్, మే 20 :** బీజేపీ కార్యకర్తల కమిట్‌మెంట్, క్రమశిక్షణపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ కార్యకర్తలు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తారని స్పష్టం చేశారు. బీజేపీలో పనిచేసే ప్రతి కార్యకర్త శిక్షణ తీసుకుని పనిచేస్తారని తెలిపారు. కమిట్‌మెంట్‌తో పార్టీ కోసం అంకితభావంతో కష్టపడతారన్నారు.బుధవారంహైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. చనిపోయిన తర్వాత కూడా బీజేపీ జెండా కప్పాలని కోరుకునే కార్యకర్తలు తమ పార్టీలో ఉన్నారని పేర్కొన్నారు. తాను కూడా కమిట్‌మెంట్ ఉన్న కార్యకర్తనన్నారు. తన కన్న కొడుకుని కూడా విచారణకు సహకరించాలని స్వయంగా పోలీసులకు అప్పగించానని ప్రస్తావించారు. చట్టం ముందు అందరూ సమానమనే భావనతోనే వ్యవహరించానని తెలిపారు. కొత్త పార్టీ వస్తుందనేది తప్పుడు ప్రచారమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌పై బండి సంజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఫామ్‌హౌస్‌లో కూర్చొని కేసీఆర్ ఏమైనా మాట్లాడొచ్చని.. కానీ తెలంగాణ ప్రజలు కుటుంబ పాలనను తిరస్కరించారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, కుటుంబ పాలనను తామే అంతం చేశామని అన్నారు. ఆయన కుటుంబ పాలన, గడీల రాజకీయాలను బద్దలు కొట్టామని అన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు బీజేపీ నిరంతరం పోరాడుతోందని బండి సంజయ్ స్పష్టం చేశారు. బీజేపీ కార్యకర్తలు సిద్ధాంతాల కోసం పనిచేస్తారని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని తేల్చిచెప్పారు. తమ పార్టీని బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త పాత్ర కీలకమని బండి సంజయ్ కొనియాడారు.

## వరంగల్ జంట హత్యల కేసు..
# నిందితునికి మరణ శిక్ష

**వరంగల్ మే 20:** ప్రేమించి పెళ్లి చేసుకున్న తన భార్యను, మాయమాటలతో తనకు కాకుండా చేస్తున్నారన్న పగతో, భార్య తల్లిదండ్రులను నరికి చంపిన నేరస్తునికి మరణశిక్ష విధిస్తూ వరంగల్ జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి జె.మైత్రేయి బుధవారం సంచలన తీర్పు వెలువరించారు. మృతుడు బానోత్ శ్రీను తల్లి బానోతు వీరమ్మ ఫిర్యాదు ప్రకారం వరంగల్ జిల్లా చెన్నారావు పేట మండలం 16 చింతల తండాకు చెందిన తన మనవరాలు దీపిక హనుమకొండలోని పింగళి కళాశాలలో చదువుకునేది. ఈ క్రమంలో తమ సమీప గ్రామమైన గుండెంగ గ్రామానికి చెందిన మేకల నాగరాజు అలియాస్ బన్నీ ప్రేమ పేరుతో ఆమెకు దగ్గరయ్యాడు. ఆటో నడుపుకునే నిందితుని మాటలు నమ్మిన దీపిక ఆ తర్వాత ఎవరికి తెలియకుండా ప్రేమ వివాహం చేసుకున్నట్లు తెలిసింది. కొద్ది రోజుల్లోనే నాగరాజు ప్రవర్తన నచ్చక దీపిక తన తల్లిదండ్రుల వద్దకు చేరుకుని అక్కడే స్థిరపడిపోయింది. అప్పటినుండి దీపికపై , ఆమె కుటుంబ సభ్యులపై పగ పెంచుకొని తనకు తన భార్యను దూరం చేసిన దీపిక తల్లిదండ్రులను, దీపికను, ఇతర కుటుంబ సభ్యులను ఎప్పటికైనా చంపేస్తానని అప్పుడప్పుడు తమ తండాకు వచ్చి నిందితుడు నాగరాజు బెదిరించేవాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నది.అందులో భాగంగా 10 -- 07- 2024 రోజు అర్ధరాత్రి పొదవాటి కత్తితో మోటార్ సైకిల్ పై తమ తండాకు చేరుకున్న నాగరాజు ఇంటి ముందు పడుకున్న దీపికను,ఆమె తండ్రి శ్రీను,తల్లి సుగుణ, సోదరుడు మదన్ లపై విచక్షణా రహితంగా కత్తితో దాడి చేశాడు, ఈ దాడిలో దీపిక తల్లి అక్కడికక్కడే చనిపోగా ఆసుపత్రికి వెళ్లే మార్గమధ్యంలో దీపిక తండ్రి శ్రీను మృతి చెందాడు. తీవ్ర గాయాలైన దీపిక, మదన్ లను తండావాసులు ఆసుపత్రి కి తరలించి సకాలంలో చికిత్స అందించడంతో వారిరువురూ ప్రాణాలు నిలుపుకున్నారు. ఈ స్వైర విహారంలో నిందితుడు నాగరాజు అడ్డు వచ్చిన తండావాసులను బెదిరిస్తూ పారిపోయి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడడం కోసం చేయి కోసుకొని ఆ తర్వాత తన భార్య దీపిక మరణించలేదని విషయం గుర్తుకొచ్చి అక్కడ నుండి పారిపోయి కుటుంబ బంధువుల ఇళ్లలో తలదాచుకోగా పోలీసులకు పట్టుబడ్డాడు అని కేసు దర్యాప్తు ద్వారా తెలిసింది.అత్యంత సంచలనం కలిగించిన ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసు విభాగం నిందితునిపై హత్య, హత్య ప్రయత్నం తదితర క్రిమినల్ కేసులు నమోదు చేయగా, అప్పటి సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్ పర్యవేక్షణలో దర్యాప్తు చేశారు, ఆ తదుపరి బాధ్యతలు చేపట్టిన నెక్కొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఈ కేసులో పూర్తి సాక్షాదారాలతో నిందితునికి వ్యతిరేకంగా చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో బాధితుల పక్షాన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బృందా దేవి వాదిస్తూ,అత్యంత హేయమైన ఈ హత్యాకాండకు పాల్పడిన నిందితునికి మరణశిక్ష విధించాలని, ఈ శిక్ష నేరస్తుల గుండెల్లో వణుకు పుట్టించాలని న్యాయస్థానాన్ని కోరారు. సాక్ష్యాదారాలు, వాదనలు పరిశీలించిన న్యాయమూర్తి జె.మైత్రేయి నిందితుడు మేకల నాగరాజు నేరపూరిత హత్యాకాండ అత్యంత పాశవికమైనదని, ఇటువంటి నిందితులకు జీవించే హక్కు లేదని, నిందితున్ని మరణించే వరకు మెడకు ఉరివేసి శిక్షణ అమలు పరచాలని తమ తీర్పులో పేర్కొన్నారు.


## బీఎడ్ (B.Ed)
## ఒరిజినల్ మెమో పోయింది

నా యొక్క పేరు EGGIDI RENUKA
FATHER NAME:BEERAIAH
Age:37 years
H.NO:4-1,Gudatipalli-Gouravrlli village,Akkannapet mandal,Siddipet District,Telangana, India
నా యొక్క ED 015373
బీఎడ్ (B Ed) SEP-2014
REF No : 1344
Roll NO:731413701051
Sangamitra College of Education -Husnabad, Siddipet District.
Satavahana University Karimnagar- 505001
ఒరిజినల్ మార్క్స్ మెమో 02- 05-2026 రోజున మా గ్రామంలో వేరొక ఇంటికి మారుతుండగా పోగొట్టుకున్నాను.కావున ఎవరికైనా దొరికితే మా అడ్రస్ లేదా **9542555663** ఫోన్ నంబర్‌కు సమాచారం అందించగలరు.









## జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్టుల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్టుల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110